## క్లుప్తంగా

### యువత సన్మార్గంలో పయనించాలి



దాచేపల్లి : యువత సన్మార్గంలో పయనించాలని పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో యువజనుల ఆదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గీతాలు ఆలపించి వాక్య సందేశం అందించారు. పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ యవ్వనంలో యువత చెడుమార్గంలో పయనించవద్దని, జీవితంలో స్థిరపడేందుకు ఆ దశ ఎంతో ముఖ్యమైందన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని యువతీ, యువకులు జీవితంలో స్థిరపడాలని, క్రీస్తు బోధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### రైలు కింద పడి వ్యక్తి మృతి

సత్తెనపల్లి: రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగింది. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన శివ ప్రసాద్ హైదరాబాద్ వెళ్లేందుకు సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఉదయం రైలు ఎక్కుతుండగా కాలుజారి రైలు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో శివప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుదాఘాతంతో 5 గేదెలు మృతి

రాజుపాలెం: విద్యుత్‌తీగలు తగిలి ఐదు పాడి గేదెలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన మండలంలోని బలిజేపల్లి వద్ద ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బలిజేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ ప్రసాద్ తన పాడిగేదెలను మేతకోసం పొలానికి తోలుకొని వెళ్లాడు. బలిజేపల్లి–గణపవరం వద్ద గేదెలు మేతమేస్తుండగా విద్యుత్ హైటెన్షన్ తీగలు తెగిపడ్డాయి. దీంతో తీవ్ర విద్యుత్‌షాక్‌కు గురైన 5 పాడిగేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.2.50లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోతున్నాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విన్నవిస్తున్నాడు.

### హైవేపై రెండు కార్లు ఢీ..

ప్రయాణికులు సురక్షితం



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతినగా అందులో ప్రయాణిస్తున్న వారికి ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాలు.. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొత్తమల్లాయపాలెం గ్రామానికి చెందిన జూపల్లి రుద్రరాజు గుంటూరు నుంచి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా.. తిమ్మాపురం తిరుమల కాటన్ మిల్లు సమీపంలో హైవేపై రహదారి పనులు చేస్తుండటం గమనించి ఒక్కసారిగా రైట్‌సైడ్‌కు వాహనాన్ని మళ్లించాడు. అదేమార్గాన కాకినాడ నుంచి చెన్నై వెళ్తున్న కారు అడ్డురావడంతో షడన్‌బ్రేక్ వేసినా అదుపుకాక అడ్డుగా వచ్చిన కారును ఢీకొంది. దీంతో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే కాకినాడ జిల్లా కిర్లంపాడు మండలం ముక్కొల్లు గ్రామానికి చెందిన కర్రీ సాయిరామ్ కారులో నలుగురు ఉన్నారు. ఊహించని విధంగా జరిగిన ఈ ప్రమాదంలో రెండు కార్లలోని ఐదుగురికి స్వల్పగాయాలు కూడా కాకపోవడంతో కార్లలోని వారితో పాటు రహదారి పనులు చేస్తున్న కార్మికులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న హైవే పోలీసులు కార్లను పక్కకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని చాట్రగడ్డపాడుకు చెందిన కర్రా రామలింగారెడ్డి(38) మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి వస్తుండగా విఠంరాజుపల్లి గ్రామం మార్కెట్ యార్డు చెక్‌పోస్టు సమీపంలో లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.


సత్రశాల దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో భ్రమరాంబికాదేవి


పాలువాయి జంక్షన్‌లో ప్రత్యేక అలంకారంలో శ్రీ కనకదుర్గ అమ్మవారు


రెంటచింతలలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు


దుర్గాదేవి అలంకారంలో వీర్ల అంకాలమ్మ తల్లి

# జగద్వ్యాపికే.. విశ్వరూపే


బతుకమ్మకు హారతులిస్తున్న మహిళలు


అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్ దంపతులు

రెంటచింతల: శ్రీదేవి శరన్నవరాత్రుల సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలోని అమ్మవార్ల దేవాలయాలలో ఆదివారం భక్తులు అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, హోమాలను నిర్వహించారు. సత్రశాలలో అతిపురాతన శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శ్రీ మహిషాసుర మర్దిని అలంకారంలో, స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవిగా, మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద త్రిశక్తి పీఠంగా విరాజిల్లుతున్న శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో శ్రీ దుర్గాదేవిగా, సరస్వతి అమ్మవారు కామేశ్వరిదేవిగా, లక్ష్మీదేవి అమ్మవారు విజయలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాలువాయి, రెంటచింతల, మంచికల్లు తదితర గ్రామాలలోని ఆలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో బతుకమ్మలో పాల్గొన్నారు. లక్కీడిప్‌లో విజేతలకు బహుమతులను అందచేశారు. సత్రశాల దేవస్థానం ట్రస్టీబోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, శ్రీ వాసవి దేవస్థానం అధ్యక్షులు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, కనకదుర్గమ్మ దేవస్థానం అధ్యక్షులు యేచూరి సాంబశివ రావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**దుర్గాదేవిగా కారెంపూడి వీర్ల అంకాలమ్మ**

కారెంపూడి: శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా కారెంపూడి వీర్ల అంకాలమ్మ తల్లి ఆదివారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని కూడా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని దాదాపు అన్ని ఆలయాలలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అలాగే ఆలయ ప్రాంగణాల్లో, గ్రామ కూడళ్లలో మహిళలు బతుకమ్మలను ఏర్పాటు చేశారు. మహిళలు పిల్లలు ఆడి పాడి బతుకమ్మను పూజిస్తున్నారు. దసరా పండుగ సోమవారం జరగనున్న నేపథ్యంలో అంకాలమ్మ తల్లి ఉదయం మహిషాసురమర్దినిదేవిగా సాయంత్రం శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిస్తారని ఆలయ పూజారులు తెలిపారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

**మహిషాసుర మర్దినిగా అమ్మవారు**

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నవరాత్రుల సందర్భంగా ఆదివారం అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

**మహిసాసురమర్దినిగా అమ్మవారు**

మాచవరం: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఆయా దేవాలయాలలో అమ్మవారు పలు అలంకణలతో భక్తులకు దర్శన మిచ్చారు. మాచవరం మండలంలోని చెన్నాయపాలెంలో శ్రీ రేణుకా అమ్మవారు మహిషాసురమర్దినిగా, మాచవరంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు కాళికాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో దుర్గాదేవిగా, మోర్జంపాడులోని బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల్లో బతుకమ్మలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

### అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

దుర్గి: పల్నాటి ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారు ఆలయానికి దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. దసరా సెలవుల సందర్భంగా వివిధ జిల్లాల నుంచి తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఆదివారం అమ్మవారికి హోమం నిర్వహించారు. వేకువజామున బిందె తీర్థము, దేవాలయ ప్రదక్షిణ, అమ్మవారి గర్భాలయ నిత్యాభిషేకం, గో పూజ నిర్వహించి అమ్మవారిని ఎర్ర పుష్పాలు, గులాబి, మందార పూలతో అలంకరణ చేశారు. మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్ దంపతులు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నర్సింహబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఆత్మకూరులో వైభవంగా కుంకుమబండ్లు ఊరేగింపు

ఆత్మకూరు (దుర్గి): శ్రీ బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రులలో భాగంగా ఆత్మకూరు గ్రామంలో ఆదివారం అమ్మవారికి కుంకుమ బండ్లను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం గ్రామస్తులు కుంకుమ బండ్లను గ్రామంలో ఊరేగింపు నిర్వహించుకుంటూ ఆలయానికి చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. మండల జేసీఎస్ కన్వీనర్ బొబ్బా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కసిరెడ్డి శాంతిరెడ్డి, రాయపరెడ్డి, కొత్త వరహాల రెడ్డి, బొబ్బా రాజశేఖర్‌రెడ్డి, టి.రవికాంత్‌రెడ్డి, అడపాల అంబారావు, యరబోతుల సత్యనారాయణ, చవ్వా బాలస్వామిరెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ అలంకరణలో కుంకుమ బండి

## నేటి సమాజానికి యువతే ఆధారం


అమరావతి: నేటి సమాజానికి, దేశ భవిష్యత్‌కు యువతే ఆధారమని ఏపీ ప్రభుత్వ క్రైస్తవ వ్యవహారాల మైనారిటీ సంక్షేమ సలహాదారుడు రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఎం బాలస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ధరణికోట జైల్‌సింగ్‌కాలనీ లూథరన్ చర్చిలో ఆదివారం నిర్వహించిన యూత్‌ఫెస్టివల్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి చర్చి పాస్టర్ సత్యానందకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాల జోలికి పోకుండా దైవచింతన, చదువుపట్ల అంకిత భావం, దేశభక్తి, పట్టుదల, నిరంతర కృషి వంటి లక్షణాలు కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఫాదర్ బాలస్వామిని యూత్‌ఫెస్టివల్ నిర్వాహకులు సన్మానించారు. యూత్‌ఫెస్టివల్ సభ్యులు లూకా, సుధాకర్, గోపి డార్సీ, విస్సీ వంశీ, పవన్, కళ్యాణ్‌లతో పాటు ధరణికోట లూథరన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.


ఫాదర్ బాలస్వామిని సన్మానిస్తున్న యూత్‌ఫెస్టివల్ నిర్వాహకులు

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

- కాలిపోయిన రూ.లక్ష 20 వేలు, 16 గ్రాముల బంగారం

పెదకూరపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని లగడపాడు గ్రామంలో పూరిల్లు దగ్ధమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఏకుల నరసింహారావు దంపతులు కౌలు రైతులు. ఆదివారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ కూడా పేలిపోవడంతో మంటలు ఎగసిపడ్డాయి. ఇంటిలో ఉన్న సామాగ్రి, దుస్తులతో పాటు డ్వాక్రా రుణం కింద తీసుకున్న రూ.లక్ష 20వేలు, 16 గ్రాముల బంగారం కూడా పూర్తిగా కలిపోయింది. దీంతో నరసింహారావు కుటుంబం కట్టుబట్టలతో ఉండటంతో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు బత్తుల కోటేశ్వరరావు, బత్తుల రాజేంద్రలు నిత్యావసర వస్తువులు, దుస్తులు అందించారు.


దగ్ధమైన పూరిల్లు

## ఐకమత్యంతో ఉండాలి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి : కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని మదరసాలో ఖురాన్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించి అభినందించారు. మదరసా నిర్వాహకులు మౌలానా షేక్ ముస్తాఫాను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జంగా మాట్లాడుతూ ఖురాన్, బైబిల్, భగవద్గీతలు అందరు కలిసిమెలసి ఉండాలని, పొరుగు వారు ఆపదలో ఉంటే సాయం చేయాలని చెబుతున్నాయన్నారు. మనిషిగా భూమి మీద పుట్టిన తరువాత కులాలు, మతాలతో ముడిపెట్టి ఇబ్బందికరంగా జీవించే పరిస్థితులు కన్పిస్తున్నాయని ఆయన చెప్పారు. ఎవరి మతం వారు అవలంబించుకునే వెసులుబాటు ఉందని, కులమతాలకు అతీతంగా సోదరభావంతో జీవించటం ముఖ్యమని ఎమ్మెల్సీ జంగా అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షరీఫ్, అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాఫా, ముఫ్తీ యూనిస్, మౌలానా ఫరూక్, ముఫ్తీ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

## కంటి వైద్య శిబిరంలో 160 మందికి పరీక్షలు

రెంటచింతల: స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల ఆవరణలో శంకర కంటి ఆస్పత్రి పెదకాకాని వారి సౌజన్యంతో రూరల్ హోమ్ ఫౌండేషన్, అమెరికా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో మొత్తం 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు గుండా జనార్ధన్‌రావు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన కంటి సమస్యలతో బాధపడే 160 మందికి పలు వైద్యపరీక్షలు నిర్వహించి వారిలో 110 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు చేయించుకునే వారికి సోమవారం పెదకాకాని శంకర్ ఆస్పత్రిలో ఉచితంగా కంటి శుక్లం చికిత్స చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దీక్ష, మంజోత్‌కౌర్, మహబూబ్, వైఆర్ఎస్ స్కూల్ కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య, వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ నాళం పెదబాబు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రెంటచింతలలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు దీక్ష, మంజోత్‌కౌర్, మహబూబ్,

## తాగునీటి సమస్య పరిష్కారానికి చేయుత

రెంటచింతల: మండలంలోని పలు గ్రామాలలో మంచినీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో మంచినీటి బోర్లు ఏర్పాటు చేయడం ద్వారా తాగునీటి సమస్య పరిష్కారానికి తమ వంతు చేయుతనిస్తున్నట్లు డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ పూర్ సంస్థ అధ్యక్షురాలు కె.థామసమ్మ అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని రెంటచింతలలో మూడు బోర్లు, పాలువాయిలో ఒక బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐర్లాండ్ దేశానికి చెందిన జాన్ మెక్ లారెన్, టిర్రో మెరాహ్, సీమస్ మిలాయ్‌లతో కలిసి వివిధ గ్రామాలలో పర్యటించి సంస్థ నేతృత్వంలో చేపట్టిన పనులను, బోర్లను పరిశీలించారు. పాలువాయి గ్రామంలో మంచినీటి బోరు ఏర్పాటు చేసి మంచినీటి సమస్యను పరిష్కరించినందుకు గ్రామానికి చెందిన శౌంతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, గుంటా నాగిరెడ్డి, గుంటా నరేంద్రారెడ్డి ఐర్లాండ్ దేశస్తులను దుశ్శాలువలతో సన్మానించారు.


ఐర్లాండ్ దేశస్తులకు సన్మానిస్తున్న పాలువాయి గ్రామస్తులు

### పోరాటయోధుడు కుమురం భీమ్

చిలకలూరిపేట: గిరిజన హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప యోధుడు కుమురం భీమ్ అని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ చెప్పారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఉన్న ఏలూరి సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో కుమురం భీమ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. తొలుత భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ అంటూ ఆదివాసుల హక్కుల కోసం నినదించారని పేర్కొన్నారు. అడవి బిడ్డల ఆత్మగౌరవం కోసం నిజాం సైన్యంతో పోరాటం చేశారని తెలిపారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలను చూసి భీమ్ 16 ఏళ్ల వయసు నుంచే పోరాటం చేశారని వెల్లడించారు. ఆదివాసులతో ప్రత్యేక గెరిల్లా సైన్యం ఏర్పాటు చేసి పోరాడారని, ఆయన పోరాటపటిమ నేటి తరానికి ఆదర్శం కావాలని చెప్పారు. సంఘ నాయకులు బి.చిన్నానాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, బి.రాంబాబునాయక్, కె. వాగ్యానాయక్, కుంభా నాగేశ్వరరావు, కొండ్రముట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.